# వాస్తవం

కుర్చీలో కూర్చొని సీరియస్‌గా రాసుకుంటున్న నేను "హల్లో మోహన్,, అంటూ వచ్చిన భూషణం మాటలకు ఈ లోకంలో పడ్డాను. నా కెదురుగా వున్న కుర్చీలో కూర్చుంటూ "ఏం మోహన్ ఏదో సీరియస్ రాస్తున్నావు" అన్నాడు భూషణం.

రాయడం ఆపి కలం కాగితాలు ప్రక్కన పడేసాను.

"ఏం లేదు భూషణం ఓ కథ రాస్తున్నాను.,, అన్నాడు.

"నీకు వేరే పనేముంది? దేన్ని గురించి?,,

"దేశంలోని పేదరికం గురించి,, అనాన్ను నేను.

నా మాటలకు భూషణం ముఖం అదోలా పెట్టాడు.

"మీ రచయితలకెక్కడేం పన్లేదు ..పేదరికమని. అదని, ఇదని అన్ని అబద్ధాలు రాస్తారు,, అన్నాడు కొంచెం కోపంగా.

అతని మాటలకు చిన్నగా నవ్వి.

"అంటే ఈ దేశంలో పేదరికమే లేదంటావా?'' అన్నాన్నేను.

"లేదనడం లేదు కాని మీ రచయితలు రాసేంత దరిద్రం మాత్రం లేదు ... మీరు గోరంత వాట్ని కొండంత చేసి రాస్తారు,,

"మంచి జీతాలతో ఉద్యోగాలు చేస్తూ, అన్ని వసతులున్న కాలనీలో నివసించే మనకు అలాగే కనపడవచ్చు కాని రచయితలు రాస్తున్నది చాలా తక్కువని నా ఉద్దేశ్యం-మనం చూస్తున్న దృష్టిని బట్టి వాస్తవాలగుపడతాయి,, అన్నాను,

"పచ్చ కామెర్ల కళ్ళతోచూస్తే నీలాంటివారి కలాగే కనబడతాయి" అన్నాడు రోషంగా__

ఇంతలో మా ఆవిడ టీ తెచ్చి టీపాయ్‌పై పెట్టింది. ఇద్దరం టీ చప్పరిసున్నాం...

"సరేలే భూషణం మనకెందుకు గొడవ" అని అప్పటికా వాదన ముగించాను. నాలోనేను ఓ దృఢమైన నిర్ణయం చేసుకున్నాను. టీ త్రాగడం ముగించాము...లోపలకెళ్ళి డ్రెస్ చేసుకొని ఓ సంచితో బయట కొచ్చాను.

"పద భూషం అలా బయటకెళ్దాం. కొంచెం కిరాణా సామాను తెచ్చేదుంది" అని భూషణంతో బయటకు నడిచాను. మాట్లాడుతూ నడుస్తున్నాం. నా దృష్టి రోడ్డూడుస్తున్న వ్యక్తిపై పడింది. కండ్లు, డొక్కలు లోతుకుపోయి, పండ్లు బయటకొచ్చి ముఖంపై ముడతలతో కనబడుతున్న ఆ మనిషి పోచయ్య. అతడు నాకు ఇదివరకు ముందే తెలుసు ఊళ్ళో బ్రతుకు దుర్భరమై ఆ డీ కాలనీకొచ్చి పేడుఊడ్చే పనికో కంట్రాక్టర్ దగ్గర కుదిరాడు.

పోచయ్యను భూషణంకు చూపెడుతూ—

"ఆ వ్యక్తెవరో నీకు తెలుసా?" అన్నాను.

నా మాటలకతడు నన్నో పిచ్చివానిలా చూసి,

"పోచయ్య! గురించేనా నువ్వనేది? అతడో స్వీపర్. వాన్ని గురించి తెలుసుకుంటాని కేముంది?" అన్నాడు భూషణం.

"ఏముంటుందని కాదుగాని అతని వయసెంతై వుంటుంది" అన్నాను

"యాభై అరవై ఏండ్లుండొచ్చు" అన్నాడు భూషణం.

అతని మాటలు విని వికృతిగా నవ్వాను నేను

"నువ్వనుకున్నట్టతని వయసు యాభయో, అరవయో కాదు నలభై యేండ్లు మాత్రమే జీవితంలోని ఆటుపోట్లకు అలసిపోయి ముఖముపై ముడతలతో ముసలాడిలా కనపడుతున్నాడు. జీవితమంతా కేవలం పొట్ట కూటి సంపాదన కోసమే వినియోగించే ఈ దేశంలోని కోట్లాది మందిలో

అతనొకడు. ఇలాంటివాళ్లు మన కాలనీలోనే వందల మందున్నారు". అన్నాను.

"ఇలాంటి వాళ్ళు రోజు కెంతో మందగుపడతారు ఇందులో కొత్త తనమేముంది?" అన్నాడు అతి మామూలుగా భూషణం.

"నిజమే కొత్త తనమేం లేదు" అన్నాను.

ఇద్దరం నడుస్తూ మరికొంత దూరం పోయాము. ఓ చెత్తకుండీ దగ్గర కొంత మంది వీధులూడ్చే కార్మికులు కూర్చొని అన్నం తింటు న్నారు సొట్టలుపడ్డ తెల్లగిన్నెల్లో అన్నం పెట్టుకొని పొద్దంట పేగల్లో ఆ గిన్నెలను మూటగట్టుకొని తెచ్చుకుంటారు...మిరపకాయ కారంతో ఎర్రగా ముద్దలుగా కలుపుకొని తింటున్నారు. గట్టిగా ఉన్న ఆ అన్నం సులభంగా నోట్లోకి పోవడం లేదు. తేపతేపకు నీళ్ళు తాగుతూ నరకం పడుతుండగా మింగలేక మింగుతున్నారు.

భూషణం వద్దంటున్నా వాళ్ళ దగ్గరకు తీసుకెళ్ళాను

"గొడ్డుకారంతో ఆ గడుకెలా తింటున్నారు? ఏదైన కూర చేసుకో వచ్చు గదా?" అన్నాను అందులో ఒకతనితో ..

అతను తినడం ఆపి—

"నిజంగనే సార్ . కని నాగపోకుంట పన్జేత్తె నెలకు మున్నూరన్న రాకపాయె. ఇండ్ల ఇంటోల్లమంత ఏందినాలె? రోగాలు నొప్పులత్తె ఏం బెట్టాలె? ఎట్లెల్లద్ది సార్ మా అసోంటోల్లకు కూరలు దొరుకుతె పండుగన్నట్టై ఇగ?" అన్నాడు.

నేను భూషణం దిక్కు చూసాను. నా చూపుల్లోని ఉద్దేశ్యాన్నర్థం చేసుకున్న భూషణం నన్నురిమి చూసాడు. అతని రోషాన్ని చూసి నాలో నేను నవ్వుకున్నాను ఇద్దరం మరికొంత దూరం నడిచాము. ఓ ఇంటి ముందు ఎదెనిమిదేళ్ళ అమ్మాయొకతి చిప్పిరెంటుకలతో, చిరిగిన లంగా జాకెట్టు తొడుక్కొని నిల్చున్నది ఒకచేత్తో నెత్తిని బరబర బరుక్కుంటూ

మరో చేతిలో ఓ తెల్లగిన్నె పట్టుకొనున్నది ...

"ఓ అవ్వా! బుక్కెడంత బువ్వెయ్యి ఆకలయితుంది బాంచెను. రొం(డ్రో)జులాయే బువ్వలేక పున్నెగంగవు తల్లి. నీ చేతులు చల్లగుండ-బుక్కెడంతెయ్యవ్వ" అని దీనంగా అరుస్తుంది. ఇంతలో ఒకావిడ గబాలున తలుపు తెరిచి—

బుచ్చెపు ముండల కేడ పన్లేదు" అని కసురుకుంటూ కొంతన్నం తెచ్చి ఆపిల్ల గిన్నెలో వేసింది...

"పోసుక తినేం లేదు బాంచెను. గింతంత తొక్కెయ్యి" దీనంగా అడిగిందా అమ్మాయి.

"ఎక్కడ పన్లేదాయె పోరి-పోబొడ్డి పో" అంటూ దబాలున తలుపేసుకుందా ఆవిడ.

"పున్నెగంగ సీ సేతులు సల్లగుండ" అంటూ మరో ఇంటి దిక్కు నడిచిందా పాప...నడుస్తూనే తలగోకు ంటూ అదేచేత్తొ గిన్నెలో ఉన్న అన్నం తింటుంది ... నేను భూషణం దిక్కు చూసాను భూషణం ఆదంతా మామూలే అన్నట్టుగా నిర్లక్ష్యంగా చూశాడు. మేము షాపింగ్ సెంటర్ దిక్కు నడుస్తున్నాము. మాకెదురుగా కొంత దూరం నుంచి అరవై ఏండ్లు పైబడ్డ వృద్దుడు వంగుతూ నడిచి వస్తున్నాడు. అతని ఒంటిపై చొక్కాలేదు. భుజంపై చినిగి పేలికలయిన తుండు గుడ్డలాంటి పేగుంది మొలకు ఆడుక్కొని తొడుక్కున్న చినిగిన ఖాకీ నెక్కరుంది పెరిగిన తెల్లగడ్డం. చిప్పిరిగా పున్న తెల్లవెంట్రుకలు ఎడమచేత్తొ జబ్బకు వేలాడదీసున్న పాత గోనె సంచీని పట్టుకున్నాడు కుడిచేతిలో కర్రున్నది, నడుస్తూ చెత్తకుండి కన్పించగానే ఆగాడు. ఇంతలో మేం కూడా ఆక్కడికి చేరుకున్నాము కుడి చేతిలో వున్న కట్టెతో చెత్తకుండీలో వున్న చెత్తను అటూ-ఇటూ గెలుకుతున్నాడు చెమటలు కారుతుంటే ఆ కుండీ లోపలకు వంగి అందులో నుండి విరిగిపోయిన ప్లాస్టిక్ సామాన్లు, దువ్వె

నులు, పాడయి పారేసిన రబ్బాలు ఏరుతూ ఒక్కొక్కటే సంచీలో వేస్తు న్నాడు చినిగిపోయి పారేసిన పాతచెప్పులు కూడా సంచిలో వేస్తున్నాడు. ఆ ముసలివానిపై నాకు జాలేసింది. భూషణం ముఖంలో కొంతమార్పు.

"చూడు భూషణం ఆ ముసలాడి పరిస్థితి—అరవయేండ్లుదాటినా జానెడు పొట్టనిండా దానికతడు ఎంతో కష్టపడాల్సి వస్తుంది మన పెద్దల నీలాంటి పరిస్థితులలో కనీసం ఊహించుకోగలమా?,, అన్నాను నడుస్తూనే...

భూషణం ఏం మాట్లాడలేదు...

"జీవిత చరమదశలో విశ్రాంతిగా కాళ్లు చాపుకొని గడపాల్సిన వయసులో కూడా ఇలాంటి వాళ్ళెంతోమంది బుక్కెడు కూటి కొరకు అవిరామంగా శ్రమిస్తున్నారు. అయినా వాళ్ళ కనీసావసరాలు తీరడం కూడా కష్టంగానే వుంది. ఇవన్నీ చూస్తూ కూడా దేశములో పేదరికము లేదంటావా?.. అన్నాను.

"నీకింకేం పన్లేదా మోహన్,, అని అ టాపిక్ కట్ చేసాడు.

ఈ సంఘటనల గూర్చి వివరించడములో భూషణం నా ఉద్దేశ్యాన్ని గమనించినా అంత తొందరగా ఒప్పుకోవడానికి ఇష్టపడటం లేదని గ్రహించాను .. పోగా, అన్ని వసతులున్న గృహాల్లో నివసిస్తూ మంచి జీతాలున్న ఇలాంటి చోట్ల తమ సమయాన్ని ఎంజాయ్‌మెంటుకే తప్ప ఇతరుల గూర్చి ఆలోచించడానికి చాలామంది సుముఖత చూపించరు. బూషణముతో మాట్లాడుతూ షాపింగ్ సెంటర్ చేరుకున్నాను కిరాణా దుకాణం దగ్గరకెళ్ళి ఆర్డరము నిచ్చాను. నాకవసరమున్న వస్తువుల పేర్లు శేటుతో చెప్పాను. నెలలో మొదటి వారమవడంవల్ల దుకాణంచాలా బిజీగా వుంది నలుగైదుగురు పిల్లలు గబగబా పనిచేస్తున్నారు హడావిడిగా అటూ-ఇటూ పరుగెడుతూ వినిమయదార్లడిగిన సామాన్లు తెస్తున్నారు. పిల్లల ముఖాలపైనుండి ధారాళంగా చెమట కారుతుంది ఊడిపోతున్న నెక్కర్లను పైకి లాక్కుంటూ హడావుడి పడుతున్నారు ఇద్దరు

పిల్లలు ఓ బియ్యపు బస్తాను లోపలిగది నుండి అతికష్టంగా బయటకు లాక్కొస్తున్నారు. దాని బరువు వాళ్ళకు భరింపరానిదిగా వుంది. అయినా కారే చెమటను కూడా తుడుచుకోకుండా వాళ్ళు దాన్ని లాక్కొచ్చి ముందు గదిలో పెట్టి దమ్ము తీసుకోవడానికి నిల్చున్నారు ... సేటు వాళ్ళను గదమాయించి—

"అవుతలెంత మందున్నరో కనపడుత లేరని... తేరిపారి నిల్చున్న ఏంది? సామాన్లియ్యండ్రి'' అన్నాడు.

ఆ మాటలకా కుర్రాల్లు సేటు దిక్కోసారి చూసి పనిలో నిమగ్న మయ్యారు ... దుకాణం ముందు రద్దీ ఎక్కువవడంవల్ల కొంచెం దూరం జరిగి ఓ స్తంభం నీడకు నిల్చున్నాం. బూషణంతో మెల్లగా అన్నాను.

"బూషణం! దుకాండ్లో పనిచేస్తున్న ఆ పిల్లల దిక్కు చూడు. ఆడుతూ పాడుతూ చదువుకొనాల్సిన పనివాళ్లు గొడ్డుచాకిరీ చేస్తూ బ్రతుకుతున్నారు వాళ్ళ కుటుంబానికి తగిన ఆర్థిక వసతులుంటే వాళ్ళిలా పనిచేయాల్సిన అవసరముంటుందా? పరిస్థితుల ప్రభావం వల్ల మరికొందరు పిల్లలు జేబుదొంగలుగా, నేరస్తులుగా మారుతున్నారు."

నా మాటలకు బూషణం కొంత ప్రభావితుడైనట్లు కనపడ్డా—

"నీలాంటి వాళ్ళన్నింటిని బూతద్దంలో చూస్తారు. అందరు పళ్ళకీ ఎక్కేవాళ్ళే అయితే మోసేవాళ్లెవరు? అని ఈరోజు నాకేమో జిడ్డోలే తలిగిన వేంది?'' అని మాటమార్చాడు.

నేను చెప్పిన వస్తువులు పొట్లాలుగా కట్టి పక్కకు పెట్టి పిలిచాడు దుకాణపు యజమాని. డబ్బు చెల్లించి వస్తువుల సంచీతో ఇంటి దారి పట్టాను. నాతో కొంత దూరమొచ్చి బూషణం తన ఇంటిదిక్కు వెళ్లాడు... నేనిల్లు చేరుకున్నాను.

బూషణంతు వివరించి చెప్పిన సంఘటనలు రోజూ చూస్తున్నవే అయినా నేను నొక్కి చెప్పడం వలన బూషణంలో కొంతమార్పు గమ

నించాను అవకాశం దొరికినప్పుడు మరికొంత వివరించి సహజముగా మంచివాడైన భూషణంకు వాస్తవ పరిస్థితి తెలియజేయాలనుకున్నాను... సమయం కొరకెదిరి చూస్తున్న నాకు కొద్దిరోజుల తర్వాత మంచి అవకాశం లబించింది. ఆ రోజు భూషణం పనిపై నేనూ, అతను కలసి కరీంనగర్ పోవాల్సిన అవసరమొచ్చింది. ఫ్రెష్ డ్రెస్ వేసుకుందామనుకున్న నాకు ఇస్త్రీ బట్టలగుపడలేదు... రెండ్రోజులక్కన్నే ఉండాలి కాబట్టి మరో జత బట్టలు కూడా కావాలి. నాల్రోజుల క్రితం తీసుకెళ్ళిన చాకలతను ఇంకా తేలేదన్నది మా ఆవిడ. నా మెదట్లో ఓ ఆలోచన తలుక్కున మెరిసింది. తయారై మా ఇంటికొచ్చిన భూషణంతో....

„రా భూషణం. బట్టలు తయారులేవు—ఎలుకపల్లి గేటవతలున్న చాకలింట్లో ఉన్నాయి. తెచ్చుకుందాం„ అని అతన్ని నా వెంట తీసుకెళ్ళాను.

మా ఫెర్టిలైజర్ సిటీ క్వార్టర్స్ కాంపౌండ్ గోడవతల ఫ్యాక్టరీలో తాత్కాలిక ప్రాతికపై పనిచేసే కూలీలు, కంట్రాక్టర్ కూలీలు. ఇతర కూలీ పనులు చేసుకునేవాల్లు, బట్టలుతికేవాళ్లు చిన్న చిన్న గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారు. దగ్గర దగ్గరగా కోళ్ళ గూళ్ళలా గుడిసెలు గుడిసెలను సమీపించగానే ముక్కుపుటాలను బ్రద్దలు కొడుతూ కంపు వాసన. గుడిసెల ముందు, ప్రక్కలకు బురద ...పెంట చెత్తా చెదారం. పిల్లల మలమూత్రాలు, ఇరుకు సందులగుండా నడుస్తూ, చాకలిల్లు చేరుకున్నాము. అతనింటి ముందు ముక్కువెంటకారే చీమిడిని ఎగబీల్చుకుంటూ పెరిగిన బొత్తలతో ఉన్న పిల్లలాడుకుంటున్నారు. వాళ్ళ బట్టల నిండా మురికి...శరీరమంతా మట్టి, మా చాకలి భార్య గుడిసె బయటున్న రాళ్ళ పొయ్యి క్రింద మంట బెట్టటానికి సతమతమవుతుంది. ఆ పరిసరాలనూ, కంపువాసననూ భరించలేక భూషణం ముక్కుకడ్డంగా దస్తీ పెట్టుకున్నాడు. పొయ్యివి ఊది ఊది అలసిపోయిన చాకలి భార్య...

"పొయ్యి పొడుగాను మండి సత్తలేదు" అని వెనుకకు చూసింది

"అయ్యో మీరచ్చిండ్రా సార్" అని పక్కకున్న చంటిపిల్లను తీసుకొని లేచి గుడిసెలోపలి కెళ్ళింది. గుడిసెలున్న భర్తతో మేమొచ్చిన సంగతి చెప్పింది అతడు ఇస్త్రీ బట్టలను ఓ కాగితంలో మడిచి తెచ్చి

"అల్చమయింది సార్... రొండ్రోజులు జెరమచ్చింది. ఏమనుకో కుండ్రి అని కొంచవోతర-ఇంటికి తెచ్చియ్యమంటరా?" అన్నాడు

''నువ్వు తీసుకొస్తే ఆలస్యమవుతది...ఇప్పుడే ఊరెళ్ళాలి. అని అతని చేతిలోని బట్టలు తీసుకున్నాను ..

కోళ్ళను కోసిపారేసిన వెంట్రుకలను, వంట చెరుకుగా ఉపయోగించుకోవడానికి పడేసిన కంపను, బొగ్గను, చెత్తను ప్రయత్నపూర్వకంగా దాటుకుంటూ గుడిసెలుదాటి బయటకొచ్చాము. ఇంటిదిక్కు నడుస్తూ

''భూషణం! మన మురికి బట్టలుతుకుతూ, మన ఇండ్లలో అన్ని పనులు చేస్తుంటారు వాళ్లు కాని వాళ్ళ పరిస్థితెలా వుందో చూడు పశువులు కూడా అంతటి హీనస్థితిలో వుండవు. వాళ్ళకలా వుండాలని వుంటుందా చెప్పు—? చేస్తున్న పనివల్ల వాళ్ళ అవసరాలకే తీరక వాళ్లా పరిస్థితిలో వున్నారు ఏమంటావు" అన్నాను.

భూషణం ఏం మాట్లాడలేదు...రోడ్డుమీది కొచ్చింతర్వాతకాండ్రకించి ఉమ్మివేసి...

"అబ్బ! నరకం నుంచి బయటకొచ్చినట్టయింది" అన్నాడు.

మా ఇల్లు చేరుకున్నాం. బట్టలు మార్చుకొని ఓ ద్రెస్ బ్రీఫ్ కేసులో సర్దాను...ఇద్దరం బస్టాండు కొచ్చాం. పది నిమిషాల ముందే బస్సు వెళ్ళిపోయినట్టు తెలిసింది. మూడు గంటల వరకు ఒక్క బస్సు కూడా లేదు...ఆటోలో పోదామనుకున్నాము, ఎంత సేపు చూసినా ఒక్క ఆటో రాలేదు...

"గోదావరిఖని వరకు నడిచిపోదాం పా—మూడు కిలో మీటర్లకంటే ఎక్కువుండదు" అన్నాను భూషణంతో—

భూషణం సరేననగానే ఇద్దరం బయలుదేరాము...

రైల్వేగేటు దాటి నడుస్తున్నాం... ఫెర్టిలైజర్ సిటి నుండి గోదావరిఖనికి పోయే త్రోవలో ఒరియా కూలీల బొమ్మరిల్లలాంటి గుడిసెలున్నాయి—ఆ గుడిసెలు మరీ భూమిలోకే ఉన్నాయి. లోపలి కెళ్ళాలంటే మోకాళ్ల వరకు వంగాలి. వాటిని చూస్తే ఎరుకలవాల్లు పందుల కొరకు కట్టిన గుడిసెలు కళ్ళముందు కదులుతాయి వాళ్ల గుడిసెల ప్రక్కనుంచే ప్లాంట్లనుండి వెలువడే మలిన పదార్థాలు కలిసున్న నీరు ప్రవహిస్తుంటుంది. ఆ మలిన పదార్థాలు కలిసే కుంటలో వాల్లు స్నానాలు చేస్తారు—ఆ నీరు విషపూరితమైనా అదే వాల్లు ఉపయోగిస్తారు నల్లగా కమిలినట్టున్న దేహాలతో, జీవితంలో అలసిపోయినట్టుంటారు మగవాళ్ల రెండు ముక్కుదూలాల మధ్య పోగులు పెట్టుకుని, వెంట్రుకలను గట్టిగా ముడిచి నడితలపై శిఖతో జాకెట్లు లేకుండా వాళ్ల స్త్రీలుంటారు. వాళ్ల గుడిసెలను వాళ్లను చూస్తూ నడుస్తున్నాం...

"భూషణం! వాళ్ల బ్రతుకులెంత నికృష్టంగా వున్నాయో చూశావా? పొట్టచేతబట్టుకొని రాష్ట్రాలకు రాష్ట్రాలు దాటొచ్చిన వాళ్ల జీవితాలెంత అధ్వాన్నంగా వున్నాయో గమనించావా—? కోట్లాది మంది ఇంతకంటె నికృష్టంగా కూడా బ్రతుకుతున్నారు - ఒక్కపూట తిండికోసం ఒళ్లమ్ముకొని బ్రతకాల్సిన దుస్థితిలో ఈ దేశ స్త్రీలున్నారు" అన్నాను ఆవేశంగా.

"సరేగాని మోహన్ నేనారోజు వాదించింది నువ్వింకా మరిచిపోలేదా? ఉంది బాబూ! ఈ దేశంలో పేదరికం బ్రహ్మాండంగానే వుంది" అన్నాడు భూషణం—

అతడా మాటలనెలా అన్నాడో కాని నాకందులో వ్యంగ్యం కనిపించింది—

"భూషణం నువ్వేదీ సీరియస్‌గా ఆలోచించవు—" అని ఆ విషయా న్నిక పొడిగించ లేదు—

బస్టాండు చేరుకున్నాము. కరీంనగర్ బస్సు తొందరగానే దొరికింది. బస్సు నడుస్తుంది. భూషణం ఏదో ఆలోచిస్తున్నాడు. నేనూ సీరియస్ ఆలోచనలో పడ్డాను— ఇంతలో పెద్దపల్లి చేరుకున్నాము... బస్సాగింది టీ తాగొచ్చి బస్సుకు కొంత దూరంలో నిల్చున్నాము ... బస్సు ప్రక్కనే చిరిగి పేలికలయిన బట్టలు కట్టుకొని, తలవెంట్రుకలు జడలు కట్టున్న ఓ మధ్య వయస్కుడు తిరుగుతున్నాడు. అతనిశరీరంపై ఎముకలు లెక్కపెట్టేట్టుగా వున్నాయి. బస్సులోంచి ఎవరైనా ఏదైనా పారేస్తారేమోనన్న ఆశతో కాబోలు చూస్తూ తిరుగుతున్నాడు— అతని ప్రక్కనే ఓ పంది 'గుర్ గుర్' మంటూ పారేసిన అరటి తొక్కలను వాసన చూస్తూ తిరుగుతుంది. కొద్ది దూరంలో ఓ బక్క చిక్కిన కుక్క నాలుకతో రోడ్డుపై పడ్డ పదార్థాలను చవి చూస్తూ తిరుగుతుంది.

ఇంతలో తోలంతా నల్లగా కుమిలిపోయివున్న ఓ మురిగిన అరటి పండు బస్సు కిటికీలోంచి ఠప్ మని క్రింద పడింది ఆ చప్పుడు విని ఆ మనిషి గబగబా దానిదిక్కురికాడు. గుర్ గుర్ మంటూ పంది కూడా అక్కడికి కొచ్చింది కుయ్ కుయ్ మనరుస్తు కుక్క అక్కడికి చేరింది ఆ మూడు ప్రాణులూ ఆ మురిగిన అరటి పండును దక్కించుకోవడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి— పంది, కుక్క మూతులతో దాన్ని అందుకోబోయాయి. ఆ మనిషి వాట్ని అదిలించి ఆ పండును చేజిక్కించుకొన్నాడు. అతని ముఖంలో గ్రహాంతర సీమలకు పోయొచ్చినంత సంతోషం — కుక్క, పంది ఎంగిలి తగిలిందని ఏ మాత్రం ఆలోచించకుండా ఆ అరటిపండు పొట్టుతీసి దాన్నతడు ఆనందంగా తినసాగాడు.

జుగుప్సాకరమైన ఆదృశ్యాన్ని చూసిన మా హృదయాలు కదిలాయి — చాలా మంది ముఖాల్లో బాధ — ఇంతలో డ్రైవర్, కండక్టర్

రాగానే బస్సెక్కాము. బస్సు కదిలింది— కాని నా కళ్లముందు నుండి ఆ దృశ్యం కదలడం లేదు. నా పక్కనున్న భూషణం దిక్కు చూసి మెల్లగా అన్నాను.

"భూషణం! ఈ దేశంలో బుక్కెడు తిండి కోసం ఎంతో మంది మనుషులు కుక్కలతో, పందులతో కొట్లాడే స్థితిలో వున్నారన్నది పచ్చినిజం ఏ కొద్దిమందో తప్ప చాలామంది రచయితలు పరిస్థితులను క్షుణ్ణంగా అర్థం చేసుకొని రాయడంలేదు—మిడిమిడి జ్ఞానంతో రాసే కొన్నిరాతలు కూడా అర్థసత్యాలే. అంతమాత్రానికే రచయిత లేదో ఎక్కువచేసి రాస్తున్నారని గోలచేస్తున్నారు అవగాహనలేనివాళ్లు— నిజానికీ దేశంలోని పేదరికం గూర్చి ప్రస్తుతం రచయితలు రాస్తున్నది చాలా తక్కువ... కాదంటావా—?

పెద్దపల్లి బస్టాండులో ప్రత్యక్షంగా చూసిన సంఘటనతో భూషణం మనసు చలించింది ..

"మోహన్ నేనన్నీ తేలికగా తీసుకున్నానేగాని ఎప్పుడూ సీరియస్‌గా ఆలోచించలేదు—నిజానికీ దేశంలో రచయితలు రాసే దానికంటె చాలా ఎక్కువ పేదరికముందన్న వాస్తవాన్ని మనస్ఫూర్తిగా ఒప్పుకుంటున్నాను—" అన్నాడు భారమైన హృదయంతో—

ఆసంఘటన మమ్మల్ని కదిలిస్తుంటే బరువెక్కిన హృదయాలతో కరీంనగర్ బస్టాండులో దిగాము—

ప్రతిరూపం పక్షపత్రిక సెప్టెంబర్ 1984 రెండవ పక్షం